క్లుప్తంగా

రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఓ పవన్‌కుమార్

వైరారూరల్: మండలంలోని దాచాపురం, గరికపాడు గ్రామాల్లో ఖరీఫ్‌లో ముందస్తు వరిసాగుపై శుక్రవారం మండల వ్యవసాయశాఖ అధికారి ఎస్.పవన్‌కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. ఆకాల వర్షాలు, తుఫాన్‌ల వలన రైతులు ప్రతి ఏటా ఆర్థికంగా నష్టపోతున్న నేపథ్యంలో.. రైతుల ఒక నెల ముందస్తుగా వరిసాగు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా దీర్ఘ, మధ్య, స్వల్పకాలిక రకాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం



కళ్ల అద్దాలను పెడుతున్న సర్పంచ్ లక్ష్మీనారాయణ

తల్లాడ: మండలంలోని బస్వాపురం గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ సూరంపల్లి లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కంటి వెలుగుతో ఎంతో మందికి కంటి సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. ఇంతకు ముందు ఇదే పరీక్షల కోసం ఖమ్మం, హైదరాబాద్, విజయవాడ ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదనీ, ఇప్పుడు గ్రామాల్లో పేదలకు అందుబాటులోకి కంటి వెలుగు పరీక్షా పరికరాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో తల్లాడ మండల వైద్యాధికారి రత్న మనోహర్, కంటి డాక్టర్ శ్రీనివాస్, సూపర్‌వైజర్ అమృతరాజు, ఎఎస్‌ఎం సుజాత, శ్రావణ సంధ్య, మాదవి పాల్గొన్నారు.

ముత్యాలమ్మతల్లికి ప్రత్యేక పూజలు

తల్లాడ: మండలంలోని బాలపేట గ్రామంలో నేడు ముత్యాలమ్మ, పోతురాజు, నాగేంద్రుల స్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా యాగశాల వద్ద అర్చకులు వేద మంత్రోచ్చరణాలతో పూజలు చేశారు. నేడు జరిగే విగ్రహ ప్రతిష్ఠాపనలో వేదపండితుల నడుమ ఉదయం 7:30 నిముషాలకు వైభవంగా జరుగుతుంది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

సత్తుపల్లిటౌన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వకృత్వ, పాటలు, పెయింటింగ్, రంగోళి, నృత్యం పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ పి.రామచంద్రరావు అభినందించారు. ఈ నెల 2 నుంచి 8 వరకు సాహిత్య, సంస్కృతిక పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బంగారి, రాంబాబు, మాధవి, శ్రీనివాస్, శ్రీధర్, సారంగపాణి, చెన్నారావు, రవికుమార్, సుభాణి, రాజ్యలక్ష్మి, విజయ్‌కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

సాయిస్ఫూర్తి విద్యార్థుల ప్రతిభ..

సత్తుపల్లిరూరల్: గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ మతసామరస్య వారోత్సవాలలో భాగంగా హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. మతసామరస్యంపై చిత్రలేఖనం, స్కిట్స్, పాటల పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ శేషారత్నకుమారి అందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లి: సత్తుపల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు సత్తుపల్లి పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ శరత్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న జలగంనగర్, వెంగళరావునగర్, వేంసూరురోడ్, కృషిబైపాస్‌రోడ్, ఎన్టీఆర్ నగర్, గాంధీనగర్, జవహర్‌నగర్, పోస్టాఫీస్‌రోడ్, మసీద్‌రోడ్, ఆర్‌కె ఆస్పత్రిరోడ్, లలితకుమారి ఆస్పత్రిరోడ్, కిష్టారం, చెరుకుపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. దీనికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిరీక్షించాల్సిందేనా..?

ధాన్యం డబ్బులకోసం అన్నదాత ఎదురుచూపులు

- 20 రోజులైనా నగదు జమ చేయలేదు
- 215మంది రైతులకు రూ.3 కోట్ల వరకు నిలిచిపోయిన చెల్లింపులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు



ఆరికాయలపాడులో ధాన్యం కొనుగోలు చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఏన్కూరు: ఆరుగాలం కష్టపడి పండించిన పంట విక్రయించి నెలరోజులు కావస్తున్నా డబ్బు చేతికి రాకపోవడంతో రైతులు ఉసూరుమంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తూకం వేసిన రెండు రోజుల్లో డబ్బులు చెల్లిస్తామనే ప్రకటనలు ఆచరణలో అమలు కావడం లేదు. దీంతో పలువురు రైతులు వడ్డీలకు తీసుకున్న రుణం అధికమవుతుందని కల్లాల్లోనే దళారులకు అమ్ముకుని నష్టపోతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి దశాబ్దం పూర్తయిన నేపథ్యంలో ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తుంది. రెండో రోజు శనివారం రైతు దినోత్సవాన్ని నిర్వహించింది. ప్రధానంగా రైతులతో, మార్కెట్ యార్డులలో, రైతు వేదికల వద్ద ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇంత చేస్తున్న ప్రభుత్వం రైతుల ఖాతల్లో మాత్రం నగదును జమ చేయడం లేదు. ప్రభుత్వం సంబురాలు నిర్వహిస్తుండగా రైతులు మాత్రం ధాన్యం డబ్బులు ఇవ్వండి మహాప్రభో అని వేడుకుంటున్నారు.

రూ. 3 కోట్లు చెల్లింపులు జరగాలి..

మండలంలోని ఆరికాయలపాడు, జన్నారం గ్రామాల్లో ఐకేపీ తరుపున మే 5న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెండు కొనుగోలు కేంద్రాల్లో కలిపి ఇప్పటి వరకు 14వేల 185 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటా రూ.2,060, బి గ్రేడ్ ధాన్యం క్వింటా రూ.2,040 చొప్పున కొనుగోలు చేశారు. రెండు కొనుగోలు కేంద్రాల్లో 215 మంది రైతులు ధాన్యం విక్రయించారు. ధాన్యం విక్రయించి నెల రోజులు కావస్తున్నప్పటికీ ఒక్క రైతుకు కూడా నగదు చెల్లించిన పాపాన పోలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయింది. రైతులు ఇతర పంటలు వేసుకోవాలంటే పెట్టుబడులు కావాలి. కానీ ఇప్పటి వరకు చెల్లింపులు చేయడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. సుమారు 215 మంది రైతులకు రూ.3 కోట్ల వరకు చెల్లింపులు జరగాలి. ఐకేపీ అధికారులను అడిగే ఆన్‌లైన్ చేశాం.. మా దగ్గర పని అయిపోయింది. సివిల్ సప్లై డీఎం దగ్గర ఆగిపోయాయి. పై నుంచి నగదు రావాలి అంటున్నారు. దీంతో రైతులు చెల్లింపులు ఎప్పుడు వస్తాయో అని అయోమయంలో ఉన్నారు. కొంత రైతులకు రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు చెల్లింపులు జరగాలి. పంట మార్పిడి, మిషన్ల కోసం, కోతలు, కూలీల కోసం చేసిన అప్పులు పెరిగి రైతులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి తక్షణం తమకు రావాల్సిన ధాన్యం చెల్లింపులు చేయాలని రైతులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

రూ. 3.50 లక్షలు రావాలి



ఆరికాయలపాడు ధాన్యం కొనుగోలు కేంద్రంలో 170 క్వింటాళ్ల ధాన్యం విక్రయించాను. సుమారు రూ.3.50 లక్షల వరకు రావాలి. ధాన్యం విక్రయించి 15 రోజులు అయింది. ఇప్పటి వరకు చెల్లింపులు చేయలేదు. సన్నరకం వడ్లను కూడా బి గ్రేడ్ క్రింద కొంటున్నారు. అధికారులు స్పందించి తక్షణం చెల్లింపులు చేయాలి.

– భట్టు హనుమంతు రెడ్డి, రైతు, ఆరికాయలపాడు

వారం రోజుల్లోగా చెల్లింపులు జరుగుతాయి



ధాన్యం కొనుగోలు చెల్లింపులు 15 రోజులుగా నిలిచిపోయాయి. రైతులు వద్ద కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు, రైతుల జాబితా ఆన్‌లైన్ చేశాం. సివిల్ సప్లై డీయం వద్ద పెండింగ్‌లో ఉంది. పై అధికారులకు ఫోన్ చేస్తే వారం రోజుల్లో చెల్లింపులు జరుగుతాయి అంటున్నారు.

– హరినారాయణ, ఎపీఎం, ఏన్కూరు

పిల్లలను బడిలో చేర్పించాలి



ఎర్రుపాలెం: ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు



వైరారూరల్: తాటిపూడిలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఎర్రుపాలెం: మండలంలోని రాజులదేవరపాడు గ్రామంలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు సంయుక్తంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని, చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. పోషక విలువలున్న ఆహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు వడ్డించాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దుద్దుకూరు లింగయ్య, మాజీ సర్పంచ్ బండారు నర్సింహారావు, ఉప సర్పంచ్ దుద్దుకూరు సుజాత, ఎస్‌ఎంసీ చైర్మన్ ఉప్పతల వెంకటనారాయణ, ఉపాధ్యాయులు దివ్వెల వెంకట శ్రీనివాసరావు, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, విజయలక్ష్మి, తదితరులున్నారు.

ముమ్మరంగా బడి బాట కార్యక్రమం..

ముదిగొండ: మండలంలోని చిరుమర్రి, పమ్మి, ముదిగొండలలో శుక్రవారం ఉపాధ్యాయులు బడి బాట కార్యక్రమం నిర్వహించారు. పిల్లలను సర్కారు బడులకు పంపించి పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ రవికుమార్, సీఎంఓ రాజశేఖర్, జీసీడీఓ భూలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాటిపూడిలో..

వైరారూరల్: మండలంలోని తాటిపూడి ప్రాథమికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వ ప్రవేశపెట్టిన పలు రకాల సంక్షేమ పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు దొడ్డా వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ



కుట్టుమిషన్లు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు అందించారు. వైరా గ్రేటర్ విజన్‌లయన్స్ క్లబ్ సభ్యుడు లయన్ కొమ్మినేని శివప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని వైరాకు చెందిన రాణికి, లయన్ యనమద్ది శ్రీను ఆర్థిక సాయంతో వైరాకు చెందిన పణితిరమ్యకు మరో కుట్టు మిషన్‌ను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పీడీజీ డాక్టర్ కాపా మురళీ కృష్ణ మాట్లాడుతూ.. సభ్యులు తమ జన్మదినాలను పురస్కరించుకుని నిరుపేదలను ఆదుకోవడానికి ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉంగ్రు శ్యాంబాబు, ఆర్‌సీ లగడపాటి ప్రభాకర్‌రావు, క్లబ్ సెక్రటరీ తోటకూర శ్రీకాంత్, ట్రెజరర్ గంగవరపు కిషన్ రాయ్, డాక్టర్ కృష్ణ చైతన్య, డాక్టర్ రవిచంద్ర, ఉంద్రు వరలక్ష్మి, ఉయ్యూరి రామకృష్ణ, యనమద్ది శ్రీను, గోపి తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉంది



మాట్లాడుతున్న రాములు్మర్తి నాయక్

కారేపల్లి: క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీ ముందు నుండి బలంగా ఉందని వైరా నియోజక వర్గ నాయకులు ధరావత్ రామ్మూర్తి నాయక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజులలు అన్నారు. శుక్రవారం కారేపల్లిలో ఎల్‌డీఎం(లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్) సమావేశాన్ని ఎల్‌డీఎం జిల్లా కోఆర్డినేటర్ దుంపటి నగేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్టీ నియోజక వర్గాల్లో యువతలో నాయకత్వ లక్షణాలు ఉన్నవారికి ప్రాధాన్యత ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్‌డీఎంను ప్రారంభించిందన్నారు. దళిత బంధు పథకాన్ని బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు అబాసుపాలు చేశారని, అర్హులైన దళితులకు దళిత బంధు ఇవ్వకుండా, రూ.3 లక్షలకు దళిత బంధును ఎమ్మెల్యేలే అమ్ముకొని దుర్మార్గాలకు పాల్పడ్డారని వారు విమర్శించారు. తెలంగాణ కోసం 1,265 మంది బలిదానం చేసుకుంటే.. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీని విస్మరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలోకి తెచ్చేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు సురేందర్ మనియార్, ధరావత్ భద్రునాయక్, గడ్డం వెంకటేశ్వర్లు, పోలగాని శ్రీనివాసరావు, ఓంప్రకాశ్‌బాబ్, వాంకుడోత్ గోపాల్ నాయక్, ఛాయాదేవి, పురం గోవర్ధన్, సంగు నాగయ్య, ఈసాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

కల్లూరు: ఈ నెల 20న ఇందిరా పార్క్ వద్ద జరిగే చలో హైదరాబాద్ ధర్నాను జయప్రదం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్ నాయక్ పిలుపునిచ్చారు. ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు బానోత్ నందు నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం కల్లూరులో చలో హైదరాబాద్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దశరథ్ నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రజలను విచ్ఛిన్నం చేయడానికి పన్నాగం పన్నిందన్నారు. కార్యక్రమంలో నందా నాయక్, భూపతి నాయక్, కృష్ణా నాయక్, వంశీ నాయక్, బద్రిబాయి, శిరీష బాయి, చిలికి బాయి, ద్వాలి బాయి, వాలీబాయి, భవాని బాయి, అభిరాం నాయక్ పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో పోరాడాలి

కొణిజర్ల: అమరుల ఆశయాలకు అనుగుణంగా ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రభుత్వాలపై యువత పోరాటానికి సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు యర్రా బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్‌లు అన్నారు. శుక్రవారం సాయంత్రం కొణిజర్లలో సీపీఐ సీనియర్ నాయకుడు మాజీ ఉపసర్పంచ్ షేక్ మహబూబ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన సమాధి వద్ద పూలమాలలేసి నివాళులు అర్పించారు. స్వర్ణ రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తోటపల్లి సీతారాములు, తండు సోమయ్య, కొమ్మినేని వెంకయ్య, సత్యనారాయణ, బాబు, వెంకటేశ్వర్లు, మైకుప్రసాద్, వజీర్, నరసింహారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కల్లూరు: ఉపాధి కూలీలు గ్రామ పంచాయతీలో చేసిన అభివృద్ధి పనులకు గాను పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఏఐపీకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల వెంకయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం కల్లూరులో అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం కల్లూరు డివిజన్ కమిటీ సమావేశం డివిజన్ అధ్యక్షుడు గంటా శ్రీను అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధీ కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజు వేతనం రూ.600లు ఇవ్వాలన్నారు. ఉష్ణోగ్రత 47 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉండగా వ్యవసాయ కూలీలు వడదెబ్బకు గురై అకాల మృత్యువాత పడే అవకాశం ఉందన్నారు. సమావేశంలో కల్లూరు డివిజన్ కార్యదర్శి బీరెల్లి లాజర్, నారుమళ్ల మంగయ్య, కొరసా వెంకటేష్, వసంత, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

వంట సామగ్రి అందజేత

వైరారూరల్: మండలంలోని కేజీసిరిపురం గ్రామానికి చెందిన నిరుపేద యువతి షేక్.కరీష్మా వివాహానికి శుక్రవారం జమాతే ఇస్లామిక్ హింద్ ఖమ్మం జిల్లా రూరల్ అధ్యక్షుడు మొహమ్మద్ ముజీవ్ తమ బంధువుల సాయంలో రూ.12 వేలు విలువ చేసే వంట సామగ్రిని వితరణగా అందించారు. కార్యక్రమంలో షేక్.లతీఫ్, షేక్.సైదా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్షేమ ఫలాల దినోత్సవం



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, తదితరులు

పెనుబల్లి: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలో శుక్రవారం సంక్షేమ ఫలాల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెనుబల్లి జూనియర్ కళాశాల ఆవరణలో సంక్షేమ ఫలాల లబ్ధిదారులతో కలిసి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తులను ప్రోత్సహించేందుకు ప్రవేశ పెట్టిన రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం పథకంలో భాగంగా లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అలాగే కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులతో పాటు ఎమ్మెల్యే సొంత ఖర్చులతో చీరను అందించారు. ప్రభుత్వ స్థలాల్లో కొన్నేళ్లుగా గృహాలను నిర్మించుకున్న నిరుపేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం సంక్షేమ ఫలాల లబ్ధిదారులతో కలసి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మోహన్‌రావు, ఎంపీపీ అలేఖ్య, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

2కే రన్‌ను విజయవంతం చేయండి

సత్తుపల్లి: పోలీస్‌శాఖ, మున్సిపల్‌శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 6.30 గంటలకు తలపెట్టిన 2కే రన్‌ను విజయవంతం చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కల్లూరు ఏసీపీ బి.రామానుజం అధ్యక్షతన స్వచ్ఛంద, విద్య సంస్థలు, కార్మిక సంఘాలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేసవి తీవ్రత దృష్ట్యా ఉదయం 6.30 గంటలకే 2కే రన్ చేపట్టి త్వరగా ముగించాలన్నారు. అమరవీరుల స్ఫూర్తిని నింపే విధంగా 2కే రన్‌లో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ కె.సుజాత, వనమా వాసు, కొత్తూరు ఉమా, కొండపల్లి రమేష్‌రెడ్డి, చల్లగుండ్ల కృష్ణయ్య, నాయుడు వెంకటేశ్వరరావు, లింగారెడ్డి, కూసంపూడి రామారావు పాల్గొన్నారు.

ఆర్టీసీలో విలేజ్ బస్ ఆఫీసర్లు



మధిర: విలేజ్ బస్ ఆఫీసర్‌కు యూనిఫాం అందిస్తున్న డీఎం దేవదానం



సత్తుపల్లిటౌన్: విలేజ్ బస్ ఆఫీసర్ వ్యవస్థను ప్రారంభిస్తున్న ఏసీపీ రామానుజం, డీఎం రాజ్యలక్ష్మి

మధిర: టీఎస్ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఆర్టీసీలో విలేజ్ బస్ ఆఫీసర్ వ్యవస్థను ప్రారంభించటం జరిగిందని మధిర డిపో మేనేజర్ దేవదానం తెలిపారు. మధిర డిపోలో శుక్రవారం విలేజ్ బస్ ఆఫీసర్ వ్యవస్థను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మరింత చేరువయ్యేందుకు మధిర డిపో పరిధిలోని ప్రతి ఒక్క గ్రామానికి ఒక విలేజ్ బస్ ఆఫీసర్‌ను నియమించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మొండితోక లత, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, ఆర్టీసీ సిబ్బంది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలపై అవగాహన కల్పించాలి..

సత్తుపల్లిటౌన్: ఆర్టీసీ కల్పించే సౌకర్యాలు, సేవలపై ప్రయాణికులకు విలేజ్ బస్ ఆఫీసర్లు అవగాహన కల్పించాలని సత్తుపల్లి ఏసీపీ బి.రామానుజం అన్నారు. శుక్రవారం సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విలేజ్‌బస్ ఆఫీసర్లకు యూనిఫాంలను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రవేశపెడుతున్న పథకాలను, ఆర్టీసీ రాయితీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం ఏసీపీను సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ టి.విజయశ్రీ, ఏఎంఎఫ్ ఎ.వెంకటనారాయణ, స్టేషన్ మేనేజర్ గడ్డం శ్రీనివాసరావు, వెల్ఫేర్ కమిటీ సభ్యులు కిరణ్‌బాబు, ఏడీసీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ప్రజాగర్జన పోస్టర్లు ఆవిష్కరణ



సత్తుపల్లిరూరల్: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దండు ఆదినారాయణ

సత్తుపల్లిరూరల్/కొణిజర్ల: సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 11న కొత్తగూడెంలో నిర్వహించే ప్రజా గర్జన సభకు పార్టీ కార్యకర్తలు, సానుభూతి పరులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు రమేష్, గోవిందరావులు పిలుపు నిచ్చారు. శుక్రవారం సత్తుపల్లి పట్టణంలో, కొణిజర్లలోని దొండపాటి భవన్‌లో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజాగర్జన సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇంతవరకు అమలు కాలేదన్నారు. కల్తీ విత్తనాల పై చర్యలు శూన్యమన్నారు. రైతులు పడుతున్న ఇబ్బందులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయడానికే కొత్తగూడెంలో ప్రజాగర్జన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పదేళ్లలో సొంత స్థలంలో ఒక డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, కృష్ణ, సీతయ్య, రమాదేవి, బొమ్మ చిట్టెమ్మ, వెంకటమ్మ, మహాలక్ష్మి, సుబ్బమ్మ, శ్రీలక్ష్మి, రాములమ్మ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



ఎస్సై వెంకన్న

చింతకాని: లోక్ అదాలత్‌తోనే సత్వర న్యాయం జరుగుతుందని ఎస్సై పాదిల వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మండలంలో ఘర్షణలు, భూ తగాదాలు, ప్రమాదాలు, వివాహ బంధాలు, చీటింగ్, దొంగతనం, అక్రమ రవాణా, పేకాట, లాక్‌డౌన్ కేసులు ఉన్నవారు లోక్ అదాలత్‌లో రాజీ చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. రాజీ చేసుకునే ఇరువర్గాల వారు శనివారం ఉదయం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు హాజరైతే వారిని కోర్టులో ప్రవేశపెట్టి రాజీ ద్వారా వారిపై ఉన్నటువంటి కేసులను కొట్టివేయటం జరుగుతుందని తెలిపారు. ఫిర్యాదుదారులు, కక్షిదారులు ఇరువురు తమ ఆధార్‌కార్డులను వెంట తీసుకుని రావాలని సూచించారు.

అటెన్షన్ ప్లీజ్

పూర్తయ్యేదెన్నడో..!



సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వెంగళరావు నగర్ కాలనీలో రూ.12.50 లక్షల మెప్మా గ్రాంట్‌తో స్వశక్తి కమ్యూనిటీ భవనం నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులకు 2014 ఫిబ్రవరి 17న ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య శంకుస్థాపన చేశారు. స్లాబ్ వేసి గదులు నిర్మించకుండా పనులను అసంపూర్తిగా వదిలేశారు. ఈ భవనం పూర్తయ్యేదెన్నడోనని మహిళా స్వయం సహాయక సంఘాలు ఎదురుచూస్తున్నాయి.

– సత్తుపల్లి టౌన్

ప్రశ్నించాల్సిన అధికారి : కె.సుజాత, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి
సెల్ నంబర్ : 80088 01220